

మధ్యాహ్న భోజనం తిని ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి తేజస్విని

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మధ్యాహ్నం భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన పట్టణ పరిధిలోని మన్నూరు దళితవాడలో చోటు చేసుకుంది. మన్నూరు దళితవాడ ప్రాథమిక పాఠశాలలో శనివారం మధ్యాహ్నం భోజనం తిన్న ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నలుగురు విద్యార్థులు ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందగా నాలుగవ తరగతి చదువుతున్న తేజస్విని అనే విద్యార్థిని కడుపు నొప్పి, జ్వరం తాళలేక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రికి మండల విద్యా శాఖాధికారి రఘురామరాజు విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులు గుడ్డు తినడంతోనే అస్వస్థతకు గురయ్యారన్నారు.

పోరాటాలతోనే హక్కులు సాధించుకోవాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పోరాటాల ద్వారానే విద్యార్థి హక్కులు సాధించుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం జిల్లా కమిటీ సమావేశం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కుల్ని దేశంలో ప్రజాస్వామ్యం మాటున నియంతృత్వ పోకడలతో ఆటంకం పరుస్తున్నారని చెప్పారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొని వస్తున్నారని, అందులోనూ రాజకీయ రంగును రుద్దుడ కుంటూ ఆంక్షలు విధించే విధంగా ప్రభుత్వాల పనితీరు ఎత్తిచూపాలని పిలుపునిచ్చారు. విద్యారంగంలోనూ మతోన్మాదాన్ని ప్రేరేపితం చేసే విధంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని బలవంతంగా విద్యార్థులపై రుద్దే ప్రయత్నం చేస్తుందని తీవ్రంగా మండిపడ్డారు. దుర్మార్గపు ఆలోచనలతో విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో నెట్టివేసే జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత ప్రగల్బాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. నిత్యం కరువు వలసలతో అల్లాడుతున్న అట్టడుగు ప్రాంతాల్లో పరిశ్రమలు ఎక్కడా లేవని వాపోయారు. విభజన హామీల్లో పొందుపరిచిన కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించి పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. మదనపల్లి మెడికల్ కళాశాలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. అన్నమయ్య జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. విద్యారంగానికి ఉపాధి చేరువ చేస్తానన్న రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల విద్యార్థులకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణికి అడ్డుకట్ట వేసేది విద్యార్థులే అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేకుండా ప్రజాస్వామ్య గొంతుకలను కూకటివేలతో నులిమి వేస్తున్నారని తెలిపారు. సామాజిక న్యాయం జరగకుండా విద్యా కాషాయకరణ, విద్యా కార్పొరేట్ సంస్థలకు అమ్మివేస్తూ ఆర్భాటాలు ప్రకటిస్తూ దేశ జీడీపీ శాతంలో ఎంత ఖర్చు పెడుతున్నారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. మైనారిటీ విద్యార్థినుల విద్యాభ్యాసానికి తోడ్పాటు అందించే మౌలానా ఆజాద్ స్కాలర్షిప్ రద్దును ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అంచనాలతో పేద బడుగు బలహీన వర్గ విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షలా చేస్తున్నారన్నారు. యూనివర్సిటీల కేంద్రంగా డిగ్రీ కళాశాలలో ,ఇంటర్ కళాశాలలో ప్రాథమిక పాఠశాలలో, ఫార్మసీ కళాశాలలో, మెడిసిన్ రంగంలో ఇంజినీరింగ్ కేంద్రంలో ఎక్కడ చూసినా సమస్యలు తాండవిస్తున్న పాలక ప్రభుత్వాలకు అవి కనబడక అధికార దాహం కోసం విద్యారంగాన్ని అటకెక్కించారన్నారు. ఉన్నత విలువలతో కూడిన రాజకీయ వ్యవస్థను రాక్షస క్రీడగా మార్చి అగాంతకులను అందలమెక్కిస్తూ విద్యావ్యవస్థను అంగడి సరుకు లాగా డబ్బు ఉన్న వారికే విద్యగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు పోరాటాల ద్వారా హక్కుల సాధించుకోవాలని పాలక ప్రభుత్వాలను పోరాటాల ద్వార మేల్కొల్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకట రమణ, పి.జాన్ ప్రసాద్, బి.రమణ, బి.తేజ, నరేష్ పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవనాలను పూర్తి చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

సెప్టెంబర్ మాసాంతంలోగా జిల్లాలో ప్రాధాన్యత భవనాలను పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత భవనాల ప్రగతిపై పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత భవనాలు ఎన్ని, ఎన్ని పూర్తి చేశారు, ఇంకా పూర్తి చేయాల్సినవి ఎన్ని, నిర్మాణ ఏజెన్సీలు నాణ్యతగా పనులు పూర్తి చేస్తున్నారా, ఎక్కడైనా సమస్యలు ఉన్నాయా తదితర అంశాలలో ఇంజినీరింగ్ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత భవనాలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 1,118 ప్రాధాన్యత భవనాలు చేపట్టారని తెలిపారు. గ్రామ సచివాలయాలు 414 పూర్తి పూర్తి చేయాల్సి ఉండగా 216 పూర్తి చేశారని, ఆర్‌బికెలు 395 కు 187 పూర్తి చేశారని చెప్పారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్ 309కి 137 భవనాలు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ప్రాధాన్యత భవనాలకు సంబంధించి నిధుల కొరత లేదన్నారు. భవనాల నాణ్యతలో ఎక్కడ రాజీపడరాదని చెప్పారు. నిర్మాణ ఏజెన్సీలో నాణ్యతగా పనులు పూర్తిచేసేలా ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడూ తగు పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనా నిర్మాణ ఏజెన్సీలు సరిగా పనిచేయకుంటే వారిని తొలగించి నూతన ఏజెనీలకు పనులు అప్పగించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలుంటే ఉన్నత స్థాయి దృష్టికి తీసుకురావాలన్నారు. ఏరోజుకురోజు ప్రాధాన్యత భవనాల ప్రగతిని మానిటరింగ్ సిస్టంలో నమోదు చేయాలని సూచించారు. లక్ష్యం మేరకు భవనాలు పూర్తి చేయడంలో బాధ్యతగా కృషి చేయాలన్నారు. సమావేశంలో పిఆర్ ఇంజినీరింగ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం, ప్రభుత్వ సేవలు అందించాలనే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమని కార్యక్రమాన్ని పటిష్టవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ గిరీష తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జగనన్న సురక్ష, విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ అంశాలపై జిల్లా అధికారులు ఆర్డీవోలు, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, టాస్క్ ఫోర్స్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతర మండల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ ఒక్కరి నోటి నుంచి ప్రభుత్వ పథకాల ఫలాలు అందలేదని మాట రాకూడదన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు సేవలు అందించేలా అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఇంటింటి సర్వే 100 శాతం పూర్తి కావాలన్నారు. ఎవరికి ఏ అవసరమో గుర్తించి వారికి సర్వీస్ రిక్వెస్ట్ నమోదు చేయాలని చెప్పారు. జిల్లాలో ఇంకా ఎక్కడైనా వాలంటీర్లు ఇంటింటి సర్వే చేయకుండా ఉంటే సంబంధిత తహశీల్దార్లు, ఎంపిడిఒలు వెంటనే సర్వే చేయించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఒకవేళ వాలంటీర్ పోస్ట్ ఖాళీ ఉంటే మరొకరికి ఇన్‌ఛార్జి ఇచ్చి వెంటనే సర్వే చేయించాలని ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులను జగనన్న సురక్ష శిబిరాలలో పరిష్కరించాలని చెప్పారు. వివిధ కారణాలవల్ల పథకాలు అందకుండా మిగిలిపోయిన వారికి కూడా పథకాలు అందించాలని సదుద్దేశంతో ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రజా శ్రేయస్సు కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. అనంతరం సర్వే ప్రగతిపై మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో జీరో డ్రాప్‌ఔట్స్ ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం వివిధ అంశాలలో సమీక్షించి పలు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేరస్తులకు శిక్ష పడేలా చూడాలి : ఎఎస్‌పి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎస్‌పి విబి.రాజ్‌కమల్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నేరస్తులను శిక్ష పడేలా చూడాలని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్‌పి డాక్టర్ వి.బి.రాజ్ కమల్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కోర్టు పనులు చూసే పోలీస్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు విచారణ సమయంలో ఆధారాలు పక్కాగా ఉండే విధంగా చూసుకోవాలని కోర్టులో చాట్ షీట్ దాఖలు చేసిన వెంటనే సిసి, పిఆర్‌సి నంబర్లు తీసుకోవాలని సమన్లను సకాలంలో అందజేయాలని, సాక్షులకు కోర్టులో సాక్ష్యం చెప్పే విధంగా ప్రోత్సహించలని అన్నారు. సాక్షుల వాంగ్మూలం లేదా సాంకేతికత వైద్య ఆధారాలను సేకరించి వాటిని సరైన పద్ధతిలో కోర్టుకు సమర్పించాలన్నారు. సంబంధిత జడ్జితో సత్సంబంధాలు కొనసాగించి ఆయా కేసులలో నేరస్తులకు శిక్ష పడే విధంగా చూడాలన్నారు. వారెంట్స్ పెండింగ్ లేకుండా చూసుకోవాలని రోజూ క్రమం తప్పకుండా కోర్టుకు వెళ్లి అక్కడ జరుగుతున్న ప్రాసెస్ సీసీడీలు సమన్లు వారెంట్స్ కోర్టు డిస్పోజల్ అడ్వకేట్ తదితర సమాచారాన్ని సిసిటిఎన్ఎస్‌లో నమోదు చేయాలని సూచించారు. కోర్టుకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడూ సంబంధిత స్టేషన్ ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కేసు విచారణ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు సూచనలు స్వీకరించాలన్నారు. నేరస్తులకు శిక్ష పడడంలో కోర్టు పనులు చూసే సిబ్బంది విధులు చాలా కీలకంగా ఉండాలని పోలీస్ స్టేషన్‌కు న్యాయస్థానాల మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తూ అంకిత భావంతో పనిచేస్తూ శిక్ష పడే శాతాన్ని పెంచే విధంగా శ్రమించాలని అన్నారు. నిజాయితీగా పనిచేసే పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు శిక్షపడే శాతం పెరిగినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని నేర రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ రాజేంద్రప్రసాద్, డిసిఆర్‌బి ఎస్ఐలు పాల్గొన్నారు.

నష్టాలను అధిగమిస్తున్నాం : ఆర్‌టిసి ఇడి



బస్టాండ్‌లోని హోటల్‌ను తనిఖీ చేస్తున్న ఇడి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో ప్రజా రవాణా సంస్థ నష్టాలను అధిగమిస్తూ ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపుకు అడుగులు వేస్తున్నట్లు ఆర్‌టిసి కడప జోన్ కార్యనిర్వాహక సంచాలకులు గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఇడి పీలేరు డిపో, గ్యారేజ్, బస్టాండులను తనిఖీ చేశారు. డిపో ఉద్యోగులు, సిబ్బంది, బస్టాండ్‌లోని వ్యాపార సముదాయాల నిర్వాహకులతో వారి కష్ట-నష్టాలు, ఇతర సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలిసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ గత ఏడాది మే మాసానికి సంస్థ రూ.161 కోట్ల నష్టాల్లో ఉండేదని, దాన్ని ఈ ఏడాది జూన్ మాసానికి రూ.61 కోట్లకు కుదించినట్లు చెప్పారు. జిల్లాలోని ఐదు ఆర్‌టిసి డిపోల్లో పీలేరు డిపోకు ఆదాయంలో 51వ స్థానం దక్కిందని పేర్కొన్నారు. మదనపల్లి ఒకటవ డిపోకు 69వ ర్యాంకు మదనపల్లి-2 డిపోకు 59వ ర్యాంకు, రాజంపేట డిపోకు 90 మూడవ ర్యాంకు, రాయచోటి డిపోకు101వ ర్యాంకు లభించాయన్నారు. జూన్ పరిధిలోని 42 బస్టాండుల్లో రూ.2 కోట్లతో మరమ్మత్తులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఇడి విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ రాష్ట్రంలోని అన్ని డిపోలకు 1500 కొత్త బస్సులు రానున్నాయని తెలిపారు. వీటిలో కడప జోనుకు 800 కొత్త బస్సులు వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు. అనంతరం ఆయన ఆర్టీసీ బస్టాండ్‌లోని వ్యాపార సముదాయాలను, శుద్ధ నీటి సరఫరా కేంద్రాన్ని, విచారణ కేంద్రాన్ని, క్యాంటీన్‌ను, మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఆర్‌టిసి ఆర్ఎం రాము, డిపో మేనేజర్ బండ్ల కుమార్, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో శనివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఎలక్ట్రికల్స్, ఫర్టిలైజర్స్, కనకదుర్గ ఫర్టిలైజర్స్‌ను తనిఖీ చేసి స్టాక్ రికార్డులను, అమ్మకాల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి జి.ఇదురుబాష మాట్లాడుతూ శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ఎలక్ట్రికల్స్, ఫర్టిలైజర్స్ దుకాణంలో 28-28-0 రకం ఎరువుకు సంబంధించిన రికార్డులను నవీకరించకపోవడం వలన రూ.2.88 లక్షలు విలువ చేసే 14 బస్తాల ఎరువును అమ్మకానికి లేకుండా నిలుపుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎ.జి.శ్రీనివాసులు, మండల వ్యవసాయ శాఖ అధికారి జి.రాజకుమారి, విఎఎ.దేవేంద్ర, విజిలెన్స్ సిబ్బంది జనార్దన్‌రావు, హరినాధరెడ్డి, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శ్రీచౌడేశ్వరిదేవి జయంతిని పురస్కరించుకొని ఈ నెల 17వ తేదీ శ్రీకృష్ణ ఆసుపత్రి, శ్రీచౌడేశ్వరిదేవి యువజన సేవా ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి నిర్వహకులు డాక్టర్ నార్నవరం వెంకటేష్ పేర్కొన్నారు. చౌడేశ్వరి ఆలయం ఎదుట ఉదయం 7.30 గంటల నుండి ఉచిత వైద్యం శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. షుగర్, బిపి, వివిధ రకాల రక్తపరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ నార్నవరం వెంకటేష్, డాక్టర్ భోజనపు కవిత, డాక్టర్ బండి బాలాజీ, డాక్టర్ బొమ్మిశెట్టి విజయకుమార్, డాక్టర్ విజయదుర్గలు వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. పెద్దఎత్తున రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తొగటవీర క్షత్రియ కులబాంధవులు, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

బిటి కళాశాల ప్రిన్సిపల్‌గా ఆనందరెడ్డి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

బిటి కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా గాయం ఆనందరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పీలేరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్, బిటి ప్రభుత్వ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా కొనసాగారు. చిత్తూరు పివికెఎన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్న ఆనందరెడ్డిని ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్బంగా నూతన ప్రిన్సిపల్‌కు సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలకు ఫుల్ టైమ్ ప్రిన్సిపల్‌ను నియమించడం పట్ల సిబ్బంది, పూర్వ విద్యార్థులు, పుర ప్రజలు కళాశాలకు మంచి రోజులు భవిష్యత్తులో చూడగలమనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్బంగా ప్రిన్సిపల్ ఆనందరెడ్డి మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలు, అభిప్రాయాలను తెలుసుకొని, ప్రభుత్వ పెద్దల సహకారంతో అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు, విద్యార్థులు సంఖ్యను పెంచుకోవడంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రులల్లో విశ్వాసాన్ని కలిగించడానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకట శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

రాయచోటి టౌన్ : యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కడప రింగ్ రోడ్డు బృందావనం సమీపంలో ఏర్పాటు చేసిన జిఎండి రఫీ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. టాస్ వేసి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులును ఆయన పరిచయం చేసుకున్నారు. కొద్దిసేపు బ్యాటింగ్ ఆడి అటు క్రీడాకారులను, యువకులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలో త్వరలో క్రికెట్ స్టేడియం పనులను పూర్తి చేయిస్తామన్నారు. యువత విద్యతో పాటు క్రీడా రంగంలో మంచి నైపుణ్యత పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలన్నారు. రాయచోటి ప్రాంత క్రీడాకారులు చక్కటి ప్రదర్శనలు ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ప్రదర్శనలు ఇవ్వాలని చెప్పారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఓడిపోయినా నిరుత్సాహం పడకూడదన్నారు. స్నేహపూర్వకంగా క్రీడలను ఆడాలని, ఓడిపోయినా ఓటమి విజయానికి నాందిగా భావించాలన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు జిఎండి ఇమ్రాన్, ఇర్షాద్ మాట్లాడుతూ తమ తండ్రి, మాజీ ఎంపిపి జిఎండి రఫీ జ్ఞాపకార్థంగా క్రికెట్ టోర్నమెంట్‌ను నేటి నుంచి ఈ నెల 28 వరకు నిర్వహిస్తారని తెలిపారు. టోర్నీ విజేతలకు మొదటి బహుమతిగా రూ59,999, రెండవ బహుమతిగా రూ 30,999లు ఇవ్వడం ఇస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఫయాజ్ బాష, ఫయాజుర్ రెహమాన్, సివిల్ సప్లైస్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, మదనపల్లె పరిశీలకులు హాబీబుల్లా ఖాన్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, కౌన్సిలర్లు సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, బిసి సెల్ విజయభాస్కర్, కో-ఆప్షన్ సభ్యులు అయ్యవారురెడ్డి, ముదిరాజ్ యువసేన జిల్లా అధ్యక్షుడు విక్కీ దేవేంద్ర పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

రాయచోటి టౌన్: రోటరీ క్లబ్ 2023-24 సంవత్సరం నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు రోటరీ క్లబ్ జిల్లా అధికారి సయ్యద్ అష్రఫ్ అలీ అన్నారు. శనివారం ఎంపిక చేసిన రోటరీ క్లబ్ అదనపు గవర్నర్‌గా సయ్యద్ రియాజుద్దీన్, అధ్యక్షునిగా సయ్యద్ నిజాముద్దీన్, కార్యదర్శిగా హఠాన్ షౌకత్ అలీ ఖాన్, ట్రెజరర్‌గా మనోహర్ కుమార్ శెట్టిని ఎన్నుకున్నారని చెప్పారు. ఆదివారం మదనపల్లి రోడ్ లో ఉన్న మిలన్ ఫంక్షన్ హాల్‌లో ప్రమాణ స్వీకారం ఉంటుందని రోటరీ క్లబ్ సభ్యులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అనుక్షణం పర్యవేక్షణ, నాణ్యతతో కూడిన విద్యుత్తు సరఫరాను పట్టణ ప్రజలకు నిరంతరం అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఎన్‌జిఒ కాలనీలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం డిఇతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ పట్టణమంతా గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించాలనే ఈ ఏడాది సుమారు 60 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించామని చెప్పారు. పట్టణంలో లోఓల్టేజీ సమస్య దాదాపు పూర్తిగా తగ్గి 24 గంటలపాటు విద్యుత్ సరఫరా అవుతోందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాపై ప్రతి నిత్యం విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. పట్టణంలోని వెస్ట్ ఏరియాలో రూ.కోటి వ్యయంతో మాసాపేట సబ్ స్టేషన్‌లో 8ఎంవిఎ అడిషనల్ పవర్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, వైస్ చైర్మన్ ఫయా జుర్ రెహమాన్, ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఎఇలు నాగరాజు, నాగేశ్వరరావు, స్థానిక నాయకులు, జయరామిరెడ్డి, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ సరఫరాలో ఎపి అగ్రస్థానం : టిడిపి

రాయచోటి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ఆంధ్రప్రదేశ్‌ను అక్రమాల అడ్డాగా మార్చారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమాల అడ్డగా ఏపీని మార్చేశారన్నారు. రాష్ట్రంలో ఓ సైకో పాలన సాగుతోందన్నారు. టిడిపి హయాంలో ఎపి జాబ్ క్యాపిటల్ ఇండియాలా ఉండేదని, ఇప్పుడు గంజాయికి కేరాఫ్‌గా మార్చారని, యువత గంజాయి బారిన పడుతున్నారని తెలిపారు. ఎంతోమంది యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారు. గంజాయి పండించే దగ్గర నుంచి రవాణా వరకు వైసిపినేతలే హవా అన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా అది ఏపీ నుంచే వెళ్తుందని, ఒడిశాలో పండించే గంజాయి కూడా ఎపి మీదుగా వెళ్తుందని, గంజాయి రవాణా వైసిపి నాయకుల ద్వారా విచ్చలవిడిగా సాగుతోందని తెలిపారు. కోట్ల రూపాయలు వైసిపి నాయకులు ఖజానా నింపుకుంటున్నారన్నారు. వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలు చేస్తానని చెప్పి, ఎంతమంది పిల్లలుంటే అంతమందికి అమ్మఒడి అని చెప్పి మాయమాటలతో మోసపూరిత మాటలతో ముఖ్యమంత్రి మోసం చేశారని వాపోయారు. సోషల్ మీడియాలో అక్రమాలు ప్రశ్నిస్తే తెలుగుదేశం పార్టీ నాయకులు పవన్‌కల్యాణ్‌పై కావాలనే కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరికీ వచ్చే ఎన్నికల్లో తప్పకుండా గుణపాఠం చెప్తారన్నారు. సమావేశంలో పట్టణ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహబూబ్ అలీ ఖాన్, నాయకులు వెంకటరమణ పాల్గొన్నారు.

పోలికేక

ప్రజా'దృష్టి'

ఉమ్మడి జిల్లాలోని అంగన్వాడీల పోలికేక ప్రతిధ్వనించింది. తమ న్యాయబద్దమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట 36 గంటల పాటు చేపట్టిన నిరసన దీక్ష జయప్రదమైంది. జిల్లాలోని సుమారు ఏడు వేల మందికిపైగా అంగన్వాడీలు కలిసికట్టుగా చేపట్టారు. అంగన్వాడీల పోరా టానికి ఇంటి దగ్గర నుంచి భోజనాలు తెచ్చుకుని నిరసన పథానికి సంకల్పం చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని చేయాలని కోరుతూ అంగన్వాడీల డిమాండ్ న్యాయ బద్దమైనది. ఇటువంటి న్యాయమైన డిమాండ్లను పాలకులు చిత్తశుద్ధితో నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 చెల్లించాలని, తెలంగాణ తరహాలో వేతనాలు ఉండాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, అంగన్వాడీలకు ప్రమోషన్లు ఇవ్వాలని నినది ంచారు. 1985లో అంగన్వాడీల వ్యవస్థ ఆవిర్భావం నుంచి అంగన్వాడీలు సమ స్యలతో పోరాడుతున్న నేపథ్యం అందరికీ తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల రానున్న తరుణంలో అంగన్వాడీలు చేయిచేయూ కలిపి వినూత్న రీతిలో చేపట్టిన పోరాట పథాన్ని ఆకర్షించింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం అంగన్వాడీల శాంతియుత దీక్షలను, నిరసనలను మౌనంగానే పరిశీలించింది. ఇటువంటి దీక్షాదీక్షలతో మరింత కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల ఏడాది కావడంతో అంగన్వాడీల పోరాటాన్ని ఆమోదనీయమని గ్రహించినట్లు నటించినట్లు అర్థమవుతోంది. రాబోయే సుమారు పది నెలల వ్యవధిలో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో పటి ష్టమైన కార్యాచరణతో ఉద్యమాన్ని కొంతపుంతలు తొక్కించాల్సి ఉంది. తమ న్యా యద్ధమైన డిమాండ్లను కలిసికట్టుగా ఉద్యమించడంద్వారా సాధ్యమవుతుందనే నమ్మకాన్ని అంగన్వాడీల్లో ప్రోదిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్ప వచ్చు. ఉద్యమ నాయకత్వం సైతం పోరాటాల ద్వారానే తమ న్యాయబద్దమైన డిమాండ్లను సాధించుకునే అవకాశం ఉందని గ్రహించాల్సి ఉంది. ఉద్యమ తీవ్రతను మరింత క్రియాశీలం చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు అవస రమైన మరిన్ని సమరశీల పోరాటాల అమలుకు ఉద్యమ ప్రణాళికకు రూపకల్పన చేసి కార్యాచరణకు చిత్తశుద్ధితో ఉపక్రమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి- కడప ప్రతినిధి

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



మహబూబ్‌నగర్‌లో డ్రెయినేజీ కాలువను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని 3వ వార్డు మహబూబ్‌నగర్ వాసులకు మౌలిక వసతులు కల్పించడంలో మున్సిపల్ అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం చెందారని, వెంటనే మౌలిక వసతుల కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం నాయకత్వం ప్రజా సమస్యలపై మహబూబ్ నగర్‌లో పర్యటించారు. స్థానికులు అనేక సమస్యలను సిపిఎం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ప్రజలకు ఇంటి ముందు భాగాన ఉన్న అరకొర డ్రెయినేజీ కాల్వలు పూర్తిగా మురుగుతో నిండిపోయి ఉన్నాయని తెలిపారు. పైగా ఔట్ ఫ్లో లేక ఇంటి ముందు కాల్వలో మురుగు నిలిచి పోయి దోమలు పెరిగి అనేక రకాల వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. నిత్యం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఇక్కడ చాలా మంది బీడీ కార్మికులున్నారని, వారికి కనీస వసతులు లేవని, వచ్చే ఆదాయం వైద్యానికే సరిపోదని ఇక ఇంటి, చెత్త, నీటి పన్నులు, విద్యుత్ ఛార్జీలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. వ్యాధులకు డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడమేనని తెలిపారు. స్థానికులు ప్రజాప్రతినిధులుకు, కమిషనర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీకి శాశ్వత పరిష్కారం చూపాలని లేకపోతే, కాలనీ వాసులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, ఎస్. రామచంద్ర, స్థానికులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంవిజె ఆస్పత్రి సిబ్బందితో చేలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో దాదాపుగా 40 మంది వైద్యులతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. 300 మంది రోగుల పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేలూరు ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ గౌతమ్, యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అధ్యక్షులు రాజశేఖర్, మెడికల్ క్యాంపు ఆర్గనైజర్ అమరేష్, శ్రీనాథ్, 40 మంది వైద్యులు పాల్గొన్నారు.

మండల కో-ఆప్షన్ సభ్యులుగా షేక్ గౌస్‌బాషా

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

మండల కో-ఆప్షన్ సభ్యులుగా షేక్ గౌస్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నూతనంగా ఎన్నుకోబడిన మండల కో-అప్షన్ సభ్యులు షేక్ గౌస్‌బాషా ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని కలిపి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణాశాఖ డైరెక్టర్ గుల్లర్‌బాషా, రిటైర్డ్ పిఇటి షామీర్‌బాషా, మౌలానా షేక్ నజీర్‌బాషా , చాంద్‌బాషా , మొహమ్మద్ షరీఫ్, కమల్‌బాషా, ఫయా జ్‌బాషా, కరీముల్లా, హైదర్‌బాషా, సయ్యద్ కరిముల్లా, యూసుఫ్, మున్నా పాల్గొన్నారు.

వెలిగల్లు కుడి కాలువలో పూడిక తొలగింపు

గాలివీడు : వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువలో 22 కి.మీ. మేర జమ్ముతో పూర్తిగా నిండిపోవడంతో జెసిబి యంత్రాలతో పూడికను తొలగింపజేసినట్లు డిఇ శిరీష్‌కుమార్ తెలిపారు. ఇటీవల కుడికాలువ ద్వారా ఆ పరిధిలోని చెరువులు, కుంటలకు నీరు విడుదల చేశామని చెప్పారు.

అకస్మాత్తుగా మేకలు మృతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని కమ్మచెరువు గ్రామానికి చెందిన నిరుపేద మేకలకాపరి చిల్లోల్ల అంజిలప్పకు చెందిన నాలుగు మేకలు శనివారం అకస్మాత్తుగా మృతి చెందాయి. ఎంతో కష్టపడి మేపుకుంటున్న మేకలు అకస్మాత్తుగా మృత్యువాత పడడంతో అంజిలప్ప దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మేకలను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మేకలు ఏదైనా జబ్బు బారినపడి చనిపోయాయా లేక మరే కారణం చేతనైనా మృత్యువాత పడ్డాయా అనే విషయాన్ని పశువైద్యాధికారులు తేల్చాల్సివుంది.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ట్రిపుల్‌ఐటికి నలుగురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ట్రిపుల్‌ఐటికి స్థానిక జడ్‌పిహైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో చూపిన ప్రతిభ స్ఫూర్తితో ఉన్నత చదువులలో కూడా రాణించాలని కోరారు. తమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటికి ఎంపిక కావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు జ్ఞాపికలు, మెడల్స్, ప్రశంసా పత్రాలతో సత్కరించి, రూ.5వేలు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైతు మృతి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి



మృతి చెందిన జగన్మోహన్‌రెడ్డి

మండలంలోని బూడిగుంటపల్లికి చెందిన దామిరెడ్డి తిమ్మారెడ్డి కుమారుడు జగన్మోహన్‌రెడ్డి(45) ముదురు మామిడితోటలో ట్రాక్టర్ తో సేద్యం చేస్తూ ప్రమాదవశాత్తు మామిడి కొమ్మ తలలో కి దూసుకెళ్లి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదం జరిగిన తీరుపై స్థానికుల సమాచారం మేరకు పరిశీలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక వాడాలి

ప్రజాశక్తి-పుల్లంపేట



మాట్లాడుతున్న ఎస్ఐ రఘురాం

జాగ్రత్తలతో మన ప్రాణాలను మనమే కాపాడుకుందాం అని రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ రఘురాం సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు తదితర వాహనాలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలన్నారు. చిన్న వయసులోనే వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమా దాలకు గురవుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మోటారు సైకిల్ పై వెళ్లేవారు హెల్మెట్ ను కచ్చితంగా వాడాలని, వాహనాలకు రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కొంతమంది సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పరిమితికి మించిన వేగంగా వాహనాన్ని నడపకూడదని సూచించారు. వాహనాల రికార్డులను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. కారులో వెళ్లేటప్పుడు సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి-రామాపురం

స్థానిక ఎంఆర్‌సిలో శనివారం జరిగిన జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అరవింద్‌కిషోర్ మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో పౌష్టికాహారంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు రామకృష్ణుడు, జయచంద్ర పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

ప్రజాశక్తి-కలికిరి

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని ఇందిరమ్మ కాలనీ ప్రజలను కోరారు. శుక్రవారం పల్లెనిద్ర కార్యక్రమములో భాగంగా సిఐ పి.సురేశ్ కుమార్ కలికిరి టౌన్, ఇందిరమ్మ కాలనీ వాసులతో సమావేశము నిర్వహించారు. కాలనీలోని పలు సమస్యలపై చర్చించి, వారికి మైనర్లుకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని, సైలెన్సర్‌లు లేకుండా ప్రమాదకరంగా, ఇతరులకు ఇబ్బంది కలిగేలా వాహనాలు నడప రాదని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమములో ఇందిరమ్మ కాలనీ వాసులు, వార్డు మెంబరు ఖాదర్‌బాషా, కలికిరి ఎస్ఐ రహీముల్లా పాల్గొన్నారు.

మిషన్ రాయలసీమతోనే అభివృద్ధి : టిడిపి

ప్రజాశక్తి-రామాపురం

ఉమ్మడి కడప జిల్లాలను మిషన్ రాయలసీమతో అభివృద్ధి చేస్తామని రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, ఓబులేసు, దివ్యకుమార్‌రెడ్డిలు అన్నారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారాలోకేష్ పిలుపుమేరకు శనివారం రామాపురంలో మిషన్ రాయలసీమ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధి కోసం జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దే స్పోర్ట్ క్లబ్ యూనివర్సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. బెంగళూరు, హైదరాబాద్, ఇండస్ట్రియల్ కారిడార్‌లో కర్నూల్‌ను కేంద్ర బిందువుగా మారుస్తామన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రాయలసీమను ప్రగతి కేంద్రంగానూ, ఉపాధి, ఉద్యోగాలకు మార్చేందుకు చంద్రబాబునాయుడు, నారా లోకేష్ బాబులు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డి, సహాదేవరెడ్డి, నర్సుపల్లి రమేష్‌రెడ్డి, సురేషు, యశోదర, చిన్నప్ప, వినయ్ కార్తీక్, దర్బార్, వెంకటరమణ, గంగయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ రాయలసీమ పోస్టర్లను నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు



మదనపల్లె : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

నాదెండ్ల అరుణ్‌తేజ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో దొమ్మలపాటి యస్విత్‌రాజ్, చాణిక్యతేజ్‌తో కలసి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీనివాసులు, తెలుగు యువతనాయకులు షేక్‌బాబ్జాన్, టిఎన్ ఎస్ఎఫ్ ప్రభాకర్, ప్రణయ్ రాయల్, ఐటిడిపి గగన్, సాయితేజ, సాజిద్, నరేష్ పాల్గొన్నారు.

పేదల కోసమే 'జగనన్న సురక్ష' : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ములకలచెరువు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

పేదల సమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోంపల్లిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి పాల్గొని లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ప్రభుత్వ వాలంటీర్లను మోసగాళ్లు, దోపిడీదారులు, పలు అక్రమాలకు పాల్పడుతున్నారని నోటికి వచ్చినట్టు మాట్లాడడం సబబు కాదన్నారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రజిని సురేంద్ర, ఎంపిపి సాయిలీల, ఎంపిడిఒ, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎపిఎం హరినాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **వీరబల్లి :** ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. సాని పాయ సచివాలయంలో సర్పంచ్ నేతి ఆంజనేయులు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొని లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపిపి రాజేందం నాథ్‌రెడ్డి, తహశీల్దార్ తులశమ్మ, జడ్‌పిటిసి శివరాం గౌడ్, సర్పంచ్ నేతి ఆంజనేయులు, సర్పంచ్ నాగిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ బాలస్వామి, మండల శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కన్వీనర్లు, అంగన్వాడీ, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** మండలంలోని సామకోటవారిపల్లి, వెంగంవారిపల్లి గ్రామాలలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ఎమ్మెల్యే నవాజ్‌బాషా పాల్గొని లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్య క్రమంలో తహశీల్దార్ సిఆర్ మంజుల, ఎంపిడిఒ శేషగిరిరావు, ఇఒపిఆర్‌డి చలపతిరావు, డిటి తపస్విని, సర్పంచులు ఉషారాణి, జి.శ్రీవాణి, సుబ్ర మణ్యం, చంద్రాయుడు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక కొట్టాల గ్రామ సచివాల యంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సందప్ప పాల్గొన్నారు. ప్రజలకు అవస రమైన పలు రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అక్కడికక్కడే పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పం చుల సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, సర్పంచులు సహదేవరెడ్డి చెన్నకేశవరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, కోటిరెడ్డి, గంగాధర్, ఎంఇఒ త్యాగరాజు, మండల సమైక్య అధ్యక్షురాలు కుమారమ్మ పాల్గొన్నారు. **రామాపురం :** మండలంలోని రాచపల్లి, కల్పనాయునిచెరువు గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్ర మంలో మండల ప్రత్యేక అధికారులు సుస్మిత, ఇన్‌ఛార్జి తహశీల్దార్ అరవింద కిషోర్, ఎంపిడిఒ హైదర్ వల్లి, ఇఒ పిఆర్‌డి ఉషారాణి, ఎపిఎం దేవసేన, సర్పంచ్ వైష్ణవి, వెంకటరెడ్డి, వైసిపి నాయకులు బాబు ఆదినారాయణరెడ్డి, ఎంపిటిసి ద్వారకానాథ్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది మాజీ సర్పంచ్ కృష్ణయ్య వాలంటీర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** పేదలందరికీ పథకాల లబ్ధి అందించాలనే ఉద్దేశంతో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురం సచివాలయం-4 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు, మహిళలను దృష్టిలో ఉంచుకొని 11 రకాల ధ్రువపత్రాలను సచివాలయాల వద్ద ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, ఇఒ ఉదయ్ కుమార్, జడ్‌పిటిసి నిర్మల, సర్పంచ్ గంగులమ్మ, ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, నాయకులు రాయుడు, రఘు, రవి, రాజేష్, ఇర్ఫాన్, మహబూబ్‌బాషా, సాధిక్, షాహెద్, సైపుల్లా, విఆర్ఒ సుధాకర్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని రంగంపల్లి సచివాలయంలో తహశీల్దార్ నరసింహ కుమార్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘురాం, ఇఒపిఆర్‌డి ప్రకాశం, ఎఒ ఖాన్, మహిళ పోలీస్, డిజిటల్ అసిస్టెంట్ వెంకటరమణ, మండల సచివాలయాల కన్వీనర్ నాగిరెడ్డి హరినాథరెడ్డి, రంగం పల్లె సర్పంచ్, భువనగిరి రెడ్డయ్య రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వేమయ్య, శివశంకర్, విఆర్ఒ ధనమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ యశోద, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడి సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి అందరికీ అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. గోపి దిన్నె సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, శివారెడ్డి, తాసిల్దార్ శ్రీనివాసులు,ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎటిఎం గంగాధర్, ఎపిఒఅంజనప్ప, నాయకులు భాస్కర్ రెడ్డి, రంగారెడ్డి, మురళి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి- కురబలకోట

ముదివేడు రిజర్వాయర్ భూ నిర్వాసితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే ద్వారనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ కింద రూ.10 లక్షల చొప్పున నగదును అందిస్తామన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో భూనిర్వాసితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు ప్రక్రియ జాప్యం కాగల అవకాశం ఉండడంతో ప్రత్యామ్నాయంగా ఒటిఎస్ ప్రతిపాదన ముందుకు తేవడం జరిగిందన్నారు. పది లక్షలతో ఇష్టం వచ్చిన చోట ఇళ్లు కట్టుకోవచ్చన్నారు. కుటుంబంలో మేజర్లు ఉంటే వారికి రూ.5 లక్షలు ఇవ్వడానికి ప్రభుత్వంపై వత్తిడి తెస్తానని హామీనిచ్చారు. భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.100కోట్లు విడుదల చేసిందన్నారు. మరో వారంలోగా పరిహారం సొమ్మును నిర్వాసితుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం ప్రారంభమవుతుందని అన్నారు. శక్తికి మంచి ఆదుకోడానికి శాయశక్తులా కృషి చేస్తున్నానన్నాని చెప్పారు. రిజర్వాయర్‌కు భూములిచ్చిన రైతుల త్యాగం ఎప్పటికీ మరు వలేనిదన్నారు. వారి రుణం ఎవ్వరూ తీర్చుకోలేరన్నారు. రిజర్వాయర్ పూర్తయితే ఏడాదికి మూడు పంటలు పండుతాయన్నారు. సాగు, తాగునీటి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

సమస్య శాశ్వతంగా తీరుతుందన్నారు. రైతులు పెద్ద మనసుతో ఆలోచించి ఒటిఎస్‌కు ఆమోదం తెలిపితే పనులు వేగవంతంగా సాగుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ మురళి, ఎంపిడిఒ దిలీప్ కుమార్, ఎంపిపి దస్తగిరి, ప్రత్యేక ఆహ్వానితుడు బైసాని చంద్రశేఖర్ రెడ్డి ,మార్కెట్ చైర్మెన్ డి.ఆర్.ఉమాపతి రెడ్డి,ఆర్.బి.కె చైర్మన్ శివశంకర్ రెడ్డి, రిజర్వాయర్ నిర్వాసితుల రైతులు పాల్గొన్నారు.



హిజ్రాలతో మాట్లాడుతున్న ఎఎస్‌పి విబి రాజ్‌కమల్

హిజ్రాలకు రక్షణ కల్పిస్తాం : ఎఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

హిజ్రాల కోసం పోలీసులు రక్షణ ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు ఎస్‌పి డాక్టర్ విబి రాజ్ కమల్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో హిజ్రాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులకు మేరకు హిజ్రాల కోసం పోలీసులు రక్షణ ఏర్పాటు చేశామని, వారిపై జరుగుతున్న హింసను వారిపై ఉన్న వివక్ష వారి హక్కులను పరిరక్షిస్తామని చెప్పారు. హిజ్రాల భద్రతా, గౌరవాన్ని కాపాడడం లక్ష్యంగా వారిపై నేరాలు చట్టవిరమైన చర్యలు తీసుకోవడం కోసం ప్రతి జిల్లాలో రక్షణ సెల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. అన్నమయ్య జిల్లాలో హిజ్రాల కోసం ప్రత్యేకంగా ఒక పోలీస్ అధికారిని కూడా నియమించామని చెప్పారు. తమ సమస్యలను విన్నవించుకోవడానికి 1091 హెల్ప్ లైన్ ద్వారా తెలియజేస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. హిజ్రాలు తమ జీవనశైలిని మార్చుకొని వారికి ఏర్పాటు చేసిన చట్టాలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దిశా సిఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో న్యాయవాది మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తంబళ్లపల్లె సివిల్ కోర్ట్ సీనియర్ న్యాయవాది ప్రభాకర్‌రెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చెన్నై, బెంగళూరు, హైదరాబాదులో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో శనివారం చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు.. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రస్తుతం తంబళ్లపల్లె సివిల్ కోర్టులో ఎజిపిగా ఉన్నారు. న్యాయవాది మృతి పట్ల సివిల్ కోర్టు న్యాయ మూర్తి, బార్‌అసోసియేషన్ అధ్యక్షులు నాగమల్‌రెడ్డి, న్యాయవాదులు సంతాపం తెలిపారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రేషన్ డీలర్లు

రేషన్ డీలర్ల మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న విజయవాడలో నిర్వహించే రేషన్ డీలర్ల మహాసభను విజయవంతం చేయాలని జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మౌలాలి కోరారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో రేషన్ డీలర్ల మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని జిల్లాలోని రేషన్ డీలర్లు పాల్గొనాలన్నారు. డీలర్ మృతి చెందితే మట్టి ఖర్చులకు గాని రూ.15 వేలు డీలర్ కుటుంబ సభ్యులు అందజేయాలని గత ప్రభుత్వంలో ఇచ్చిన ఉత్తర్వులు ఆచరణకు నోచుకోలేదన్నారు. 2012 నుంచి 2023 వరకు ఐసిడిఎస్, ఎండిఎం పంపిణీ చేసిన నిత్యావసరకు సంబంధించి రేషన్ డీలర్లకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా మృతి చెందిన 63 మంది డీలర్లకు రూ.ఐదు లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తామని అప్పటి పౌరసరఫరాశాఖ మంత్రి హామీ ఇచ్చారని అయితే ఏ ఒక్క డీలర్‌కు చెల్లిం చలేదన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు ప్రెసిడెంట్ ఎస్.ఎం. బాషా, రామసముద్రం మండలం ప్రెసిడెంట్ సుగుణమూర్తి, కదిరప్ప, ఆర్.సుబ్రహ్మణ్యం, ఎస్.ఇమాం కాసిం, సతీష్, రఘు పాల్గొన్నారు.

రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

జమ్మలమడుగు రూరల్ స్థానిక సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాలలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఆ కళాశాల కరస్పాండెంట్ పాలా నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన డిగ్రీ కళాశాలలో మాట్లాడుతూ ఇపి సోర్స్ కంపెనీ ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. డిగ్రీలో లైఫ్ సైన్స్, హెల్త్ సైన్స్ చేసిన విద్యార్థులకు మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్న, అభివృద్ధి వైపు వేస్తున్న అడుగులు ముందుకు సాగాలన్నా మరోమారు వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించాలని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం సామకోటవారిపల్లి పంచాయతీలోని సామకోటవారిపల్లె, తరిగొండవారిపల్లె, ఎర్రంవారిపల్లెలో సర్పంచ్ మహదేవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ.రమణారెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డిలతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

విధులకు ఆలస్యంగా హాజరవుతున్న, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రహారం పంచాయతీ కార్యదర్శి మంజుల ప్రతిరోజూ విధులకు ఆలస్యంగా వస్తుండడంపై ఎమ్మెల్యే ప్రశ్నించారు. సామకోటవారిపల్లి పంచాయతీలో ప్రజలు గృహ నిర్మాణ శాఖకు, రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పనిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, విఆర్‌ఒను ప్రశ్నిం చారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, చంద్రాయుడు, ఉషారాణి, వైసిపి నాయకులు దయాకర్‌రెడ్డి, డప్‌నాగరాజా, రమణారెడ్డి, యుగంధర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, నరేంద్రరెడ్డి, శశిధర్ రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మన్న, హేమంత్, తహశీల్దార్ సి.ఆర్.మంజుల, పంచాయతీ కార్యదర్శి మంజుల, నాగమల్లి, ఎస్ఐరామకృష్ణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు శ్రీచౌడేశ్వరి జయంతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో వెలసిన తొగట క్షత్రియుల ఆరాధ్య దైవం శ్రీచౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని శ్రీచౌడేశ్వరి ఆలయ కమిటీ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 17న శ్రీచౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆలయ కమిటీ, తొగటవీర క్షత్రియ యువజన సంఘం, శ్రీచౌడేశ్వరి దేవి యువజనసేవా ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో పతిష్టాత్మకంగా నిర్వహి స్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఉప్పు రామచంద్ర, కార్యదర్శి జి.ప్రభాకర్, కోశాధికారి రామి శెట్టి లోకేష్, వెంకటేష్, జి.భాను ప్రకాష్, బి.శ్రీకాంత్, బి.పవన్ కుమార్, బి.నరసింహులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు

ప్రజాశక్తి-నందలూరు

వైసిపి నాయకులు జనసేనపార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించి వాలంటీర్లను రెచ్చగొడుతున్నారని జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా ప్రోగ్రామ్ కమిటీ కార్యవర్గ సభ్యులు గురివిగారి వాసు పేర్కొన్నారు. శుక్రవారం నందలూరు మండల వాలంటీర్లు పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా ర్యాలీ చేయడంతో శనివారం జన సైనికులు బస్టాండ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి, పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి వాలంటీర్ల మాటలను ఖండించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వ్యవస్థలోనైనా మంచి, చెడు ఉంటాయని పవన్ చెప్పారని అన్నారు. వాలంటీర్లకు రూ.5వేలు సరిపోదని వారికి వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రశాంత్, పాటూరుడాల, మండెంరాము, ఉపేంద్రాసాయి రాజు, మురళి, పాటూరుహరీష్ ,షైక్ షాకీర్, బాషా, లక్ష్మీ నారాయణ, అంజి, శివ, మల్లి, యర్రా శ్రీను, మంకు వెంకటేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

మొహరం వేడుకలకు 'చమర్తి'కి ఆహ్వానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని నాగులమాను వీధికి చెందిన ముస్లిం యువత త్వరలో జరగబోయే మొహరం పండుగ సందర్భంగా ఆహ్వాన కమిటీ సభ్యులు కాలేషా, రహమతుల్లా, మున్నా యాసీన్, ఆధ్వర్యంలో నియోజకవర్గ టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజును కలిసి ఆహ్వానించారు. సందర్భంగా జగన్‌రాజు మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా మొహరం పండుగ వేడుకలను నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయనను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుధీర్, సలామ్, మౌలా, సర్దార్, అబ్దుల్లా, అల్తాఫ్ మహమ్మద్, బాబీ, పాల్గొన్నారు.



జగన్మోహన్ రాజును సన్మానిస్తున్న మొహరం కమిటీ సభ్యులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



మృతి చెందిన ఉపాధ్యాయుడు

రాజంపేట జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద లూరుకు చెందిన మురళీకృష్ణ(60) అనే ఉపాధ్యాయుడు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు..నందలూరు మండలం, నాగిరెడ్డిపల్లిలో నివాస ముంటున్న మురళీకృష్ణ రెవెన్యూ కాంప్లెక్స్ సమీపంలోని బాపు జ్యోతిరావుపూలే పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ద్విచక్ర వాహనంలో బైపాస్ రోడ్డుపై వస్తుండగా ముందుగా వెళుతున్న కారు డోర్ తీయడంతో కిందపడ్డారని, కిందపడిన ఆయనపై లారీ దూసుకెళ్ళడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తల్లి మందలించిందని మనస్థాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం నిమ్మనపల్లి మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. రెడ్డివారిపల్లి పంచాయతీ సోమాను పల్లి కాలనీలో నివాస ముంటున్న కె.అర్జున్(20) పనులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండడంతో తల్లి ప్రమీల మంద లించిందని తెలిపారు. మనస్థాపం చెందిన అర్జున్ గ్రామానికి సమీపంలోని పొలాల వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారని అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.